పేదల ఆరోగ్య సంరక్షణకే వైద్యశిబిరాలు



ఉచిత వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యులు, స్థానికులు

రసూల్‌పురా: పేదలకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలు అందించేందుకు ఉచిత రోగ నిర్ధారణ వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని లేయర్స్ స్కిన్ అండ్ హెయిర్ క్లినిక్స్ ఎండీ డాక్టర్ సుధీర్‌రెడ్డి అన్నారు. గణతంత్ర దినోత్సవాల సందర్భంగా బొల్లారం జనప్రియ టవర్స్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో మూడు వందల మందికి బీపీ, డయాబెటిస్, చర్మ సంబంధిత పరీక్షలు చేసినట్లు చెప్పారు. నగరవ్యాప్తంగా తమ ఆసుపత్రికి చెందిన పది బ్రాంచ్‌ల ద్వారా ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు పూజారెడ్డి, సుష్మ, శరణ్య, రాశి, జనప్రియ టవర్స్ అధ్యక్షుడు నాయర్, గురుదత్, అమరేందర్ రెడ్డి, శ్రీకాంత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం



లాలాపేట: సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో లాలాపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలోని 20 మంది ఎస్సీ, ఎస్టీ, నిరుపేద, సింగిల్ పేరెంట్ విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వేదిక తెలంగాణ కో కన్వీనర్ వేణు, ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్‌చాలక్ డా.గంజాం కృష్ణప్రసాద్, కోటేశ్వర్‌రావు, నేతి రాములు, శ్రీనివాస్, రఘు, హెచ్‌ఎం ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనుల ప్రారంభం



మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న విద్యాసాగర్, హేమ

చిలకలగూడ: కలుషిత జలాలు, లోప్రెషర్ సమస్యలను పరిష్కరించేందుకు పలు ప్రాంతాల్లో నూతన పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపడుతున్నామని జలమండలి మారేడుపల్లి డీజీఎం విద్యాసాగర్, సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అన్నారు. శ్రీనివాసనగర్ మెథడిస్ట్ చర్చి ప్రాంతంలో రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను సోమవారం వారు ప్రారంభించారు. నిర్మాణపనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రజుమంలో జలమండలి శ్రీనివాసనగర్ సెక్షన్ మేనేజర్ నవ్య, బీఆర్‌ఎస్ నాయకులు శైలేందర్, జకీర్, కృష్ణ, కరీంలాలా, లక్ష్మీ, కాంతమ్మ, ప్రవళిక పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



నిరుపేద విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న సారిపల్లి కొండల్‌రావు తదితరులు

సనత్‌నగర్: మోడల్ కాలనీకి చెందిన మానవ సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సనత్‌నగర్ ప్రభుత్వ రౌండ్‌టేబుల్ పాఠశాలలోని ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. మోడల్‌కాలనీలోని బృందావనం ఉద్యానవనంలో సోమవారం జరిగిన 'గరల్స్ ఆన్ వీల్స్'కార్యక్రమంలో ఈ ఆధునిక సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, ట్రస్ట్ ప్రతినిధులు బుచ్చిబాబు, జేఎస్‌టీ శాయి, శశికాంత్, కాలనీ ప్రతినిధులు కేఎన్‌రావు, అమ్ములు, పీఎంకే గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఖేలో భారత్ క్రీడలు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఖేలో భారత్ క్రీడోత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని బి గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జాతీయ కార్యదర్శి శ్రవణ్, బి.రాజ్, గ్రేటర్ నేత రాజశేఖర్ ముఖ్యఅతిథులుగా హాజరై క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏబీవీపీ ఓయూ అధ్యక్షులు దృహన్, కార్యదర్శి శివశంకర్, రాష్ట్ర నాయకులు అలివేలి రాజు, కమల్ సురేష్, హరిప్రసాద్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కాలేజ్ స్టేషన్ కాడా..!



విరిగిన చైర్లు

బౌద్ధనగర్: బౌద్ధనగర్‌లోని ఆర్ట్స్ కాలేజీ రైల్వే స్టేషన్ అధికారుల నిర్లక్ష్యానికి నిలయంగా మారింది. ఈ స్టేషన్‌కు మూడు నెలల నుంచి స్వీపర్లు రావడం లేదు. ఔట్ సోర్సింగ్ కార్మికులు కూడా అందుబాటులో లేరు. దీంతో రైల్వే స్టేషన్ పరిసరాలన్నీ అపరిశుభ్రంగా, దుర్గంధభరితంగా మారాయి. పార్కింగ్ స్టాండ్, టికెట్ కౌంటర్, ప్లాట్ ఫామ్‌లు పూర్తిగా చెత్తా చెదారంతో నిండిపోయాయి. ఈ స్టేషన్ నుంచి నిత్యం ఎంఎంటీఎస్, ప్యాసింజర్ రైళ్లు ప్రయాణం సాగిస్తుంటాయి. నిజామాబాద్, మెదక్, బోధన్, కరీంనగర్, మహబూబ్‌నగర్, గుంటూరు వెళ్లే ప్యాసింజర్ రైళ్లు ఇక్కడ ఆగుతాయి. రైళ్ల కోసం వేచి చూసేవారు కూర్చునే బెంచీలు కూడా విరిగిపోయాయి. తాగు నీటి నల్లాలు కూడా పూర్తిగా శిథిలమవ్వడంతో గుక్కెడు తాగునీరు కూడా దిక్కులేదు. స్టేషన్‌లో వెంటనే పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని మాజీ రైల్వే బోర్డు పీఎస్‌సీ మెంబర్ వెంకటరమణి అధికారులను కోరారు.



అపరిశుభ్రంగా టికెట్ కౌంటర్ ప్రాంగణం



విరిగిన బెంచీ



వెంకటరమణి, మాజీ రైల్వే బోర్డు పీఎస్‌సీ మెంబర్



శిథిలమైన తాగునీటి నల్లాలు

మాస్కుల పంపిణీ

సనత్‌నగర్: కల్వరి ఎడ్యుకేషనల్ రూరల్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బేగంపేట పాటిగడ్డలోని బండిమెట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పునర్వినియోగ మాస్కులను అందజేశారు. హెచ్‌ఎంపీవీ వ్యాప్తి అవుతున్నట్టు వస్తున్న వార్తల నేపథ్యంలో ముందుజాగ్రత్తగా మాస్కులు అందజేసి విద్యార్థులకు అవగాహన కలిగించారు. సొసైటీ ప్రతినిధి రాకేష్ విద్యార్థులకు జాగ్రత్తలు వివరించారు.

వేడుకగా స్కౌట్స్ అండ్ గైడ్స్ డే

లాలాపేట: తార్నాక డివిజన్ శాంతినగర్‌లోని తక్షశిలా పబ్లిక్ స్కూల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ తనుప్రీత్ కౌర్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశ భక్తి పెంపొందుతుందన్నారు. అనంతరం స్కౌట్స్ ఆండ్ గైడ్స్ విద్యార్థుల మార్చ్ ఫాస్ట్, డ్రిల్ కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకల్లో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇక రామన్నకుంట సుందరీకరణ: రామకృష్ణ



రామన్నకుంట ఎగువ కాలనీల్లో పర్యటించిన బోర్డు సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్: త్వరలో రామన్నకుంట సుందరీకరణ పనులు చేపడతామని బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ అన్నారు. సోమవారం బోయిన్‌పల్లి రామన్నకుంట సమీపంలోని సీతారాంపూర్, శ్రీనివాసనగర్ కాలనీల్లో పర్యటించారు. రామకృష్ణ మాట్లాడుతూ బోయిన్‌పల్లిలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రామన్నకుంట సమస్యకు 90 శాతం పరిష్కారం చూపామన్నారు. ముఖ్యంగా సుమారు రూ.3 కోట్లతో రింగ్ సీవర్ ఏర్పాటు చేశామన్నారు. దీంతో రామన్నకుంట పరిసర కాలనీలు, బస్తీలకు ముంపు సమస్య తొలగిందన్నారు. ఇక కుంట ఔట్‌లెట్‌లను పెంచి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పారు. ఎలివేటెడ్ కారిడార్ కోసం కంటోన్మెంట్ కోల్పోయిన భూములకు సంబంధించి రూ.300 కోట్ల పరిహారం నిధులు త్వరలోనే విడుదలవుతాయన్నారు. ఈ నిధులను స్థానికంగా డ్రైనేజీ, నాలాల ఆదునీకరణకు కేటాయించాలని కేంద్రాన్ని కోరగా, సానుకూలంగా స్పందించిందన్నారు. కార్యక్రమంలో ఆరో వార్డు బీజేపీ అధ్యక్షుడు ప్రతీక్ జైన్, సీనియర్ నాయకులు అజయ్ గౌడ్, స్థానికులు స్వరూప, డాక్టర్ రజనీకాంత్, గోపాల్ గౌడ్, ప్రవీణ్ యాదవ్, నందం గౌడ్, యాదయ్య, శ్రీనివాస్ గౌడ్, సంజీవ్, చంద్రమౌళి, నాగరాజు, బిజెపి నాయకులు ప్రశాంత్ ప్రభు, శంకర్, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి మార్కెట్‌ను ఆదర్శంగా మారుస్తాం: శ్రీగణేశ్



ఎమ్మెల్యే శ్రీగణేశ్‌తో బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి మార్కెట్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ మార్కెట్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. సోమవారం జరిగిన మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వెంకన్న చైర్మన్ ఆనంద్ బాబు, వైస్ చైర్మన్‌గా దేవేందర్, సభ్యులుగా అంకాల సాయి శరత్, దోమల సంతోష్ కుమార్, సంతూ జూలియస్, సీఎం.రామన్, బి.కృష్ణారెడ్డి, కాసారం దుర్గేశ్ గౌడ్, సిద్ధాపురం ఆకాశ్‌రెడ్డి, అజీజ్ పాషా, నల్లోల రాజేందర్, ఎండీ అస్లామ్ సోఫీ, ఎల్‌ఏ గౌతమ్, ఎస్.ప్రభాకర్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు. మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలని వారికి ఎమ్మెల్యే సూచించారు. మార్కెట్‌లో నూతన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో కంటోన్మెంట్, కూకట్ పల్లి, మల్కాజ్ గిరి నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రసూల్‌పురా: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. సోమవారం తిరుమలగిరి తహసీల్దార్ అశోక్‌తో కలసి 64 మంది కల్యాణలక్ష్మి, 32 మంది షాదీముబారక్ లబ్ధిదారులకు మొత్తం 96 లక్షల 11 వేల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఎమ్మెల్యేగా ఎన్నిక కాకముందు శ్రీగణేష్ ఫౌండేషన్ ద్వారా మహిళ సాధికారత కోసం పలు కార్యక్రమాలు చేపట్టానని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల కోసం అధికారులు సర్వే నిర్వహిస్తున్నారని, వారికి సహకరించి వివరాలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మురళి ముదిరాజ్, రంగా రవీందర్ గుప్త, నాగినేని సరిత, భవాని తదితరులు పాల్గొన్నారు.

200 మంది 'అసెజ్' సభ్యుల శ్రమదానం



చెత్తను సేకరిస్తున్న యువత, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ సుచిత్ర

రాంగోపాల్‌పేట్: పర్యావరణ పరిరక్షణకు యువత పెద్ద ఎత్తున ముందుకు రావాలని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం అసెజ్ (ఏ టు జడ్ సేవ్ ద ఎర్త్) సంస్థకు చెందిన 200 మంది యువత సంజీవయ్య పార్కు వద్ద, హుస్సేన్‌లో సాగర్ చుట్టు పక్కల పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణ సవాళ్లతో కూడుకున్నదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి సంస్థకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ పీవీ ప్రభాకర్‌రావు, యువత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జితేందర్‌రావు, తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్, జేఎన్‌టీయూ వీసీ వి.బాలకిష్టారెడ్డి, రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను విస్మరించొద్దు



మాట్లాడుతున్న డా.ఉపేందర్

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీలోని కాంట్రాక్టు అధ్యాపకులను విస్మరించవద్దని కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం కోఆర్డినేటర్ డా.ఉపేందర్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువుల అర్హతతో 20 ఏళ్లుగా వర్సిటీలను నమ్ముకొని తక్కువ వేతనానికి పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పే స్కేల్ అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించిన తర్వాతే పర్మనెంట్ అధ్యాపక నియామకాలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు వెంకటేష్, రాజేంద్రప్రసాద్, చిరంజీవి, రామలింగం, జయశ్రీ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 40, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 13, క్యారెట్ 21, దొండ 35, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 45, గోకరకాయ 28, కీర 28, దోసకాయ 23, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 25, చామగడ్డ 40, మొరంగడ్డ 28, కందగడ్డ 60, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 10-12, ముల్లంగి 4-5. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ఆల్విన్, గ్రీన్‌ల్యాండ్స్, మైత్రీవనం సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సనత్‌నగర్ బస్టాప్ వెనుక ప్రాంతం, అశోక్ కాలనీ, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వెంకట్ ప్లాజా, ఒద్రా జ్యువెలర్స్, కృష్ణా జ్యువెలర్స్, ఎక్సైడ్ బ్యాటరీ లేన్, మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు ఆర్‌ఎస్ బ్రదర్స్, కాకతీయ మెస్, అమీర్‌పేట మెయిన్‌రోడ్డు, దుర్గానగర్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

ఫ్లెక్సీలను తొలగించాలి

బౌద్ధనగర్: వారాసిగూడ చౌరస్తాతోపాటు పలు ప్రాంతాల్లోని స్వాతంత్ర సమరయోధుల విగ్రహాల ముందు ఏర్పాటు చేసిన పలు పార్టీల ఫ్లెక్సీలను తొలగించాలని సికింద్రాబాద్ సర్కిల్ డీసీ సుభాష్‌రావును బీజేపీ నేతలు కోరారు. ఈ సందర్భంగా సోమవారం బౌద్ధనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాయిప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సుభాష్‌రావును కలిసి వినతిపత్రం సమర్పించారు. పార్శిగుట్టలోని అశోక్ సేవా సంఘం కమ్యూనిటీ హాలుకు డ్రైనేజీ లైన్‌తోపాటు అంబర్ నగర్ బస్తీలో నూతన రోడ్డు వేయాలని కోరారు. కార్యక్రమంలో నర్సింగ్‌రావు, మణి, ఉపేంద్రబాబు పాల్గొన్నారు.

వ్యాపారి హత్య కేసు నిందితుల అరెస్టు

రసూల్‌పురా: విక్రంపురికి చెందిన పాన్‌మసాలా వ్యాపారి బొల్లు రమేష్ హత్య కేసులో ముగ్గురు నిందితులను కార్ఖానా పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రెండు లక్షల రూపాయల నగదు, రెండు బంగారు ఉంగరాలు, ఓ కారు, బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కార్ఖానా ఎస్‌హెచ్‌వో రామకృష్ణ తెలిపిన వివరాలు... ఈ నెల 18న డబ్బుల కోసం బొల్లు రమేష్‌ను నిందితులు కిడ్నాప్ చేసి, హత్య చేసిన విషయం తెలిసిందే. ఓ కన్సల్టెంట్ సంస్థలో క్లర్క్‌గా చేస్తున్న హయత్‌నగర్ నివాసి మహ్మద్ అజాం షరీఫ్(35), పాన్‌మసాలా వ్యాపారులు, సంతోషనగర్‌కు చెందిన మహ్మద్ పర్వేజ్ (35), షహీర్ మీర్జా (42) ఈ కేసులో నిందితులు. నిందితులు తమ ఇళ్లల్లో ఉండగా విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు వెళ్లి పట్టుకున్నారు. సీసీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలతో కేసును త్వరితగతిన ఛేదించామని తెలిపారు.

ఓయూలో మాదిగ విద్యార్థుల సంబరాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు లభించడంపట్ల ఓయూలో మాదిగ విద్యార్థులు సంబరాలు జరుపుకున్నారు. సోమవారం మాదిగ విద్యార్థి ఫెడరేషన్(ఎంఎస్‌ఎఫ్) రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం శేఖర్‌మాదిగ మాట్లాడుతూ దేశంలో అత్యంత వివక్షతకు గురవుతున్న మాదిగల గుర్తింపు కోసం 30 ఏళ్లుగా పోరాడిన మంద కృష్ణ త్యాగాలను కేంద్రం గుర్తించి పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేసిందని పేర్కొన్నారు.

క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



విజేతలకు బహుమతులను అందజేసిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: క్రీడల పరంగా విద్యార్థులను, యువతను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మోండా మార్కెట్ డివిజన్ ఆదయ్యనగర్ ప్లేగ్రౌండ్స్‌లో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఆయన విజేతలకు సోమవారం బహుమతులను ప్రదానం చేశారు. తలసాని మాట్లాడుతూ యాంత్రికమైన జీవన విధానంలో ప్లేగ్రౌండ్స్ వైపు యువత రావడం లేదన్నారు. క్రీడల ద్వారా విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ఎంతో ధృడంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో దినేష్ ఆనంద్, విజయానంద్, అఖిలేష్, మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే.....

వాలీబాల్ టోర్నమెంట్‌లో మొదటి బహుమతిని ఆదయ్యనగర్ వాలీబాల్ జట్టు కైవసం చేసుకోగా, ద్వితీయ స్థానంలో కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయం జట్టు, తృతీయ బహుమతిని అల్వాల్ లయోలా కాలేజీ దక్కించుకుంది.

చిరువ్యాపారులకు మార్గదర్శకాలు అవసరం

పద్మారావునగర్: చిరు వ్యాపారులు ట్రాఫిక్, ప్రజలకు ఇబ్బందులు లేకుండా తమ కార్యకలాపాలు నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. సోమవారం పద్మారావునగర్ పార్కు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహించుకునేవారికి స్పష్టమైన మార్గదర్శకాలను అధికారులు జారీ చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఏళ్ల తరబడి ఫుట్‌పాత్‌లను స్థావరంగా జీవనోపాధి పొందుతున్న పేదల పట్ల అధికారులు మానవతా దృక్పథంలో వ్యవహరించాలని కోరారు. పద్మారావునగర్ పార్కును లక్షలాది రూపాయలతో అందంగా తీర్చిదిద్దామని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె.హేమలత, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, జలమండలి జీఎం వినోద్, పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి బాల్‌రెడ్డి, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు పవన్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్ పనుల అడ్డ'గుట్ట

పరిష్కరించాలని జోనల్ కమిషనర్‌కు బీజేపీ వినతి



రవికిరణ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

అడ్డగుట్ట: డివిజన్‌లోని పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె జోనల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆమె మాట్లాడుతూ అడ్డగుట్ట చౌరస్తా నుంచి గణేష్ టెంపుల్ వరకు వరదనీటి పైప్‌లైన్, నందనార్ నగర్‌లో సీసీ రోడ్డు, వెంకట్ నగర్‌లో రిటర్నింగ్ వాల్, సీసీ రోడ్డు, కొండారెడ్డి పార్కులో నూతన గేటు, ఫెన్సింగ్, సుభాష్ చంద్రబోస్ విగ్రహం సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. వినతిపత్రం సమర్పించినవారిలో బిజేపీ నాయకులు హంసరాజు, ఉదయ్ యాదవ్, శివలింగ చారి, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

విద్యకే ప్రథమ ప్రాధాన్యం

సాక్షి, సిటీబ్యూరో: పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దడమే తల్లిదండ్రుల మొదటి ప్రాధాన్యంగా నిలవాలని ఐడీబీఐ సీజీఎం శరత్ కామత్ అన్నారు. సోమవారం న్యూబాకారం ప్రభుత్వ పాఠశాలలో సీఎస్‌ఆర్ నిధులతో నిర్మించిన తరగతి భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ కార్యక్రమం కింద చేపడుతున్న పనుల్లో విద్య, ఆరోగ్య రంగాలకు అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. ఈ పాఠశాలకు వచ్చినప్పుడు తరగతులకు సరిపడా గదులు లేకపోవడంతో ఆ తర్వాత గదిని నిర్మించామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌హెచ్ పట్నాయక్, ముషీరాబాద్ శాఖ మేనేజర్ దీప్తి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిబ్బంది కొరత.. ఇబ్బంది కొంత

బేగంపేట్ సర్కిల్ పరిధిలో పౌర సేవలకు ఆటంకం



జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ కార్యాలయం

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ పరిధిలో సిబ్బంది కొరత పౌర సేవలకు ఆటంకంగా మారింది. పెరుగుతున్న ప్రజావసరాలకు అనుగుణంగా సేవలు అందక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అరకొర సిబ్బందితోనే పరిపాలన వ్యవస్థను నెట్టుకొస్తున్నారు. దాదాపు అన్ని విభాగాలు ఇన్‌చార్జ్‌లతోనే కొనసాగుతుండటం గమనార్హం. సర్కిల్ పరిధిలో బన్సీలాల్‌పేట్, రాంగోపాల్‌పేట్, బేగంపేట్, మోండా మార్కెట్ డివిజన్లు ఉన్నాయి. ఈ సర్కిల్ నుంచి రూ.కోట్లలో జీహెచ్‌ఎంసీకి ట్యాక్స్ రూపేణా ఆదాయం సమకూరుతోంది.

అర్హుల గుర్తింపు ఎలా...

ప్రభుత్వం ఇటీవల ప్రజలకు వివిధ రకాల పథకాలను అందించడానికి అనేక కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తోంది. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల లబ్దిదారులను గుర్తించే బాధ్యతను జీహెచ్‌ఎంసీకి అప్పగించింది. అయితే ఉద్యోగులు సరిపడా లేక అర్హులను గుర్తించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సిబ్బంది తూతూమంత్రంగా తమ పనులు కానిస్తున్నారు. ఆయా పనులకు పరిపాలన పరమైన అనుమతులు, పత్రాల జారీ, ఇతరత్రా కార్యకలాపాలు కుంటుపడుతున్నాయి. పనుల కోసం ప్రజలు వారాలు, నెలల తరబడి నుంచి జీహెచ్‌ఎంసీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. మరోవైపు పలు విభాగాల ఇన్‌చార్జ్‌లు అందుబాటులో ఉండకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

సర్కిల్ పరిధిలో ఇన్‌చార్జ్‌ల విభాగాలు...

కీలకమైన టౌన్‌ప్లానింగ్, హెల్త్, వెటర్నరీ, ఫుడ్ తదితర విభాగాలకు ఇన్‌చార్జ్‌లే కొనసాగుతున్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో చాలా కాలం నుంచి సెక్షన్ ఆఫీసర్లు లేకపోవడంతో చైన్‌మెన్‌లే అన్నీ తామై చక్రం తిప్పుతున్నారు. జీహెచ్ఎంసీకి పన్నుల రూపేణా ఆదాయం తెచ్చిపెట్టే విభాగంలో సూపరింటెండెంట్‌ల కొరత ఉంది. ఆయా విభాగాల్లో కనీసం ఔట్ సోర్సింగ్ ఆపరేటర్‌లు కూడా లేకపోవడం గమనార్హం.